9th - HAPPY - ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు


సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 346 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | శుక్రవారం 23 ఆగస్టు 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## లోన్‌యాప్‌లపై ఈడీ ఉక్కుపాదం..

### రూ.19.39కోట్ల డిపాజిట్లు అటాచ్



**హైదరాబాద్ పెన్ పవర్:**లోన్ యాప్ లపై ఈడీ ఉక్కుపాదం మో పుతోంది. లోన్ యాప్ లకేసులో మరో రూ. 19 కోట్ల 39 లక్షల డిపాజిట్లను అటాచ్ చేసింది. గతంలో లోన్ యాప్ లపై తెలంగాణలో 118 కేసులు నమోదు చేసింది. ఈ కేసుల ఆధారంగా 242 రుణ యాప్ లపై మనీలాండరింగ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. గతంలో పలు ఫిన్ టెక్ కంపెనీలకు చెందిన ఆస్తులు, బ్యాంకు అకౌంట్లను సీజ్ చేసింది ఈడీ.తాజాగా నిమిష ఫిన్ టెక్, రాజ్ కోట్ ఇన్వెస్ట్ మెంట్స్,

వివరాలు 2లో..

## ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత... ఎయిమ్స్‌కు తరలింపు

- జైలు డాక్టర్ల సూచన మేరకు ఆసుపత్రికి తరలింపు
- ఆసుపత్రిలో కవితకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు
- వైరల్ ఫీవర్, గైనిక్ సమస్యలతో బాధపడుతున్నట్లు వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:**ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టై తీహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురయ్యారు. జైలు డాక్టర్ల సూచనల మేరకు అధికారులు ఆమెను

వివరాలు 2లో..



# రుణమాఫీపై బీఆర్ఎస్ నిరసన సెగ..

### రుణమాఫీ హామీ నెరవేర్చలేదు

### రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలె

### మాజీ మంత్రి హరీష్ రావు

### రుణమాఫీపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

**హైదరాబాద్ పెన్ పవర్:**రుణమాఫీ చేస్తామని అనేక దేవుళ్ల మీద ఒట్లేసి, చేయకుండా సీఎం దైవద్రోహానికి పాల్పడ్డారని బీఆర్ఎస్? వర్కింగ్? ప్రెసిడెంట్, మాజీ మంత్రి? కేటీఆర్ విమర్శించారు. పంట రుణమా ఫీపై రాష్ట్రంలోని అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్?ఆధ్వర్యం లో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. రుణమాఫీపై ప్రభుత్వ తీరుకు నిరసనగా చేవెళ్లలో రైతులతో కలిసి కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ?ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిసెంబర్ 9న ఒక్క సంతకంతో రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మం డిపడ్డారు. రుణమాఫీపై ప్రభుత్వ తీరును నిరసిస్తూ మా జీ మంత్రి హరీశ్?రావు యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి టెంపుల్? టూర్? చేపట్టారు. అనంతరం ఆలేరులో రైతులతో కలిసి నిరసన కార్యక్రమంలో పాల్గొని హరీశ్? రావు మాట్లాడారు.. రుణమాఫీ పై

ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలన్నా రు. రుణమాఫీపై మంత్రులు తలో మాట మాట్లాడుతు న్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రైతులందరికీ రుణ మాఫీ చేయాలని డిమాండ్? చేశారు. సీఎం దేవుడి మీద ఒట్లు వేసి మాట తప్పినందున ప్రజలను శిక్షించొద్దని ఆ లక్ష్మీనరసింహాస్వామిని వేడుకున్నట్లుగా ఆయన తెలిపారు. మండలి మాజీ చైర్మన్ స్వామి గౌడ్ మాట్లాడుతూ.. రెండు లక్షల రుణం మాఫీ చేయకుండా కాంగ్రెస్ రైతులను మోసం చేస్తోందన్నారు. రాష్ట్రంలో మరో ఉద్యమం రావాలన్నారు. సీఎం గవర్నమెంట్ బిల్డింగ్‌లో ఉండాలన్నారు.

## రేవంత్ రెడ్డికి సవాల్ విసిరితే సమాధానం రాలేదు

**హైదరాబాద్ పెన్ పవర్:**తన సొంతూరు కొండారెడ్డిపల్లెలో 100 శాతం రుణమాఫీ జరిగినట్లు నిరూపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ విసిరితే సమాధానం రాలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో నిర్వహించిన ఆందోళనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలంటే రూ.49 వేల కోట్లు అవసరమని బ్యాంకర్లు... ముఖ్యమంత్రికి చెప్పారని, ఆ తర్వాత మంత్రివర్గంలోనూ రూ.31 వేల కోట్లకు తీర్మానం చేశారని గుర్తు చేశారు. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు కూడా రుణమాఫీకి రూ.26 వేల కోట్లు కేటాయించారన్నారు.కానీ ఇప్పుడు కాంగ్రెస్ వంద శాతం రుణమాఫీ చేశామని చెప్పడం విడ్డూరమన్నారు. ఆరు గ్యారెంటీలు,

వివరాలు 2లో..

## గుజరాత్ దుష్టచతుష్టయం దేశాన్ని పట్టి పీడిస్తోంది

- హైదరాబాద్ ఈడీ కార్యాలయం ఎదుట ధర్నాలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి
- కేంద్రం వైఖరిని నిరసిస్తూ దేశంలోని ఈడీ కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ ఆందోళనలు
- హైదరాబాద్‌లో ధర్నాలో పాల్గొని ప్లకార్డ్ ప్రదర్శించిన ముఖ్యమంత్రి
- 16 మంది ప్రధానుల కంటే మోదీ రెండింతలు అప్పులు చేశారని విమర్శ




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ పారిశ్రామికవేత్త అదానీకి వ్యతిరేకంగా ఏఐసీసీ ఇచ్చిన పిలుపు మేరకు టీపీసీసీ అధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కేంద్ర సంస్థల్ని తమ గుప్పిట్లో పెట్టుకొని కొందరికి మాత్రమే లబ్ధి చేకూరేలా ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వ్యవహరిస్తున్నారని, ముఖ్యంగా అదానీకి లబ్ధి చేకూరుస్తున్నారని, దీనిని నిరసిస్తూ దేశంలోని అన్ని ఈడీ కార్యాలయాల ఎదుట కాంగ్రెస్ పార్టీ గురువారం నాడు ఆందళనలు నిర్వహించింది.ఇందులో భాగంగా రేవంత్ రెడ్డి హైదరాబాద్ ఈడీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా

వివరాలు 2లో..

## సంజయ్ రాయ్ మనిషి కాదు... మృగం!...

### దర్యాప్తులో దిగ్భ్రాంతికర విషయాలు



**పెన్ పవర్ డెస్క్:**కోల్ కతా అత్యాచార ఘటనలో నిందితుడు సంజయ్ రాయ్ గురించి దర్యాప్తులో నివ్వెరపోయే విషయాలు తెలిశాయి. ఆర్జీ కర్ ఆసుపత్రిలో ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం చేసి, అనంతరం హత్యకు పాల్పడిన నేపథ్యంలో, సంజయ్ రాయ్ మానసిక స్థితిని అంచనా వేయడానికి సీబీఐ కొందరు మానసిక విశ్లేషకులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసింది.

వివరాలు 2లో..

## సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్.. డిప్యూటీ సీఎం భట్టి కూడా..

### డిప్యూటీ సీఎం, దీపాదాస్ కూడా

### ఏఐసీసీ పిలుపుతో పయనం



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇవాళ రాత్రి 9 గంటలకు ఢిల్లీ వెళ్లనున్నారు. ఆయనతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర ఇన్ చార్జి దీపాదాస్ మున్షి కూడా అదే విమానంలో హస్తిన పయనమవుతున్నారు. ఏఐసీసీ నుంచి పిలుపు రావడంతోనే వీళ్లు ఢిల్లీ వెళ్తున్నట్టు సమాచారం. రేపు ఉదయం ఏఐసీసీ నేతలతో భేటీ అవుతారని తెలుస్తోంది. పీసీసీ చీఫ్ నియామకం, మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల అంశంపై ప్రధానంగా చర్చిస్తారని సమాచారం.ఆరు గ్యారెంటీల అమలు అంశాన్ని సీఎం, డిప్యూటీ సీఎం ఏఐసీసీ నేతలకు వివరించనున్నారు. సచివాలయం ఎదురుగా

వివరాలు 2లో..

## తెలంగాణలో బీఆర్ఎస్ ఎక్కడుంది?

### బీజేపీలో బీఆర్ఎస్ కలిసిపోయిందన్న కోమటిరెడ్డి

### సెబీ చైర్ పర్సన్ అక్రమాలపై విచారణ వేయాలని డిమాండ్

### అదానీ ఆస్తులపై న్యాయ విచారణ జరగాలన్న కోమటిరెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో టీఆర్ఎస్ కానీ, బీఆర్ఎస్ కానీ లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎప్పుడో బీజేపీలో కలిసిపోయిందని చెప్పారు. హైదరాబాద్ లోని ఈడీ కార్యాలయం ముందు కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్చార్జి దీపా

వివరాలు 2లో..

## యాదగిరిగుట్ట కేంద్రంగా హీటెక్కిన పాలిటిక్స్..

### హరీష్ రావు పూజలపై ఈవో అభ్యంతరం



**హైదరాబాద్ పెన్ పవర్:** యాదగిరిగుట్ట ఆలయ కేంద్రంగా హీటెక్కిన తెలంగాణ పాలిటిక్స్ వేడెక్కాయి. యాదగిరిగుట్ట ఆలయం పైన మాడవీధుల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేలు సంకల్పం చేయడంపై ఆలయ ఈవో భాస్కర్ రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యక్తులతో మాడవీధుల్లో పూజలు చేయడంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమతి లేని ప్రదేశంలో బీఆర్ఎస్ నేతలు బయటి పూజారులతో మాడవీధుల్లో పూజలు చేశారంటూ ఆలయ అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. సెక్షన్ 7 రిలీజియస్

వివరాలు 2లో..



## కోల్‌కతా డాక్టర్ హత్యాచారం కేసును రాజకీయం చేయకండి

### కేంద్రం, బెంగాల్ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు హితవు

- విచారణ వేళ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, బెంగాల్ ప్రభుత్వ న్యాయవాది కపిల్ సిబల్ మధ్య వాగ్వాదం
- రెచ్చగొట్టే ప్రకటనలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోర్టును కోరిన సిబల్
- బెంగాల్ మంత్రి కూడా వ్యాఖ్యలు చేశారన్న తుషార్ మెహతా
- దయచేసి ఈ ఘటనను రాజకీయం చేయవద్దని సీజేఐ చంద్రచూడ్ సూచన

**హైదరాబాద్ పెన్ పవర్:** కోల్‌కతా డాక్టర్ హత్యాచారం కేసును రాజకీయం చేయవద్దని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్ర చూడ్ కేంద్రానికి, అలాగే పశ్చిమ

వివరాలు 2లో..

## జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ

- తెల్ల రేషన్ కార్డుదారులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త!
- తెల్ల రేషన్ కార్డుదారులకు జనవరి నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామన్న మంత్రి
- రేషన్ బియ్యం పక్కదారి పడితే డీలర్‌షిప్ రద్దు చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక
- ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాల్లో డీలర్ల భర్తీకి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి గుడ్ న్యూస్ చెప్పింది. ఈ రేషన్ కార్డుదారులకు వచ్చే జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం వెల్లడించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలా చేస్తే డీలర్‌షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఖాళీగా ఉన్న రేషన్ దుకాణాలకు సంబంధించి... 1,629 రేషన్ డీలర్ల భర్తీకి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



# సంపాదకీయం

## ఆక్రమణలతోనే ఈ దుస్థితి...

ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ ఇలా అన్ని మెట్రో సిటీస్ వరద బాధిత నగరాలే. ఎందుకంటే నగరాలు వేగంగా విస్తరిస్తున్నాయి. భూముల విలువ విపరీతంగా పెరిగిపోయింది. ప్రైమ్ లొకేషన్ లో గజం దొరికినా చాలు అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. దీంతో కొందరు నాలాలు, చెరువుల భూముల్ని కబ్జా చేయడం మొదలు పెట్టారు. అందుకే హైదరాబాద్ సహా మెట్రో నగరాలది ఇదే పరిస్థితి. మన హైదరాబాద్ విషయానికే వద్దాం. భాగ్యనగరానికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. 1925 నాటికి భాగ్యనగర జనాభా నాలుగున్నర లక్షలు మాత్రమే. 1950 నాటికి 10 లక్షల దాకా చేరుకుంది. ఇప్పుడు కోటి దాటిపోయింది. మరి సౌకర్యాలు ఇంకెంత పెరిగి ఉండాలి. ఎప్పుడో నిజాం కాలం నాటి డ్రైనేజీలే ఇంకా వాడడంతోనే హైదరాబాద్ కు తరచూ ఈ సమస్య వస్తోంది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు గత పాలకులు సరైన చర్యలు తీసుకోకపోవడం, కార్యాచరణ రెడీ చేసినా అవి ముందుకు జరగకపోవడంతో సమస్యలు పెరిగి ఇదిగో ఇలా రోడ్లే చెరువులుగా మారిపోయిన సీన్ కనిపిస్తోంది, ఓ స్టడీ ప్రకారం హైదరాబాద్ లో 5 శాతం జనాభాకు వరదలతో హైరిస్క్ ఉంటోంది. ఏకంగా 93 శాతం జనాభాకు మధ్యస్థంగా ఫ్లడ్ రిస్క్ ఉంటోంది. ఇక కేవలం 2 శాతం జనాభాకే లో రిస్క్ ఉంది. అంటే సిటీలో మెజారిటీ జనాభాకు వరద ముప్పు ఉంది. ఇళ్లల్లోకి నీరు చేరడం, లోతట్టు ప్రాంతాలు మునిగిపోవడం, ఫలితంగా ట్రాఫిక్ జామ్ అవడం.. ఇలా అంతా ఎఫెక్ట్ అవుతున్నారు. ఇప్పుడు హైడ్రా చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతోంది. మరి నాలాలపై అక్రమ నిర్మాణాల విషయంలోనూ అదే స్పీడ్ చూపుతారా అన్న చర్చ సిటీ జనాల్లో పెరుగుతోంది. ఎందుకంటే అంతా గట్టిగా అనుకుంటేనే మార్పుకు నాంది పడుతుంది. అలా జరిగినప్పుడే సిటీ జనాభా పెరిగినా ఎవరికీ ఇబ్బంది లేకుండా ఎవరి పని వాళ్లు చేసుకునే వీలు కలుగుతుంది. లేదంటే ఇదిగో ఇంకెన్నాళ్లైనా ఇలాగే ఉంటుంది..హైదరాబాద్ లో చిన్న చినుకులకే వ్యవస్థ ఆగమైపోతోంది. కేవలం 2 సెంటీమీటర్ల వర్షపాతాన్ని తట్టుకునే డ్రైనేజీ వ్యవస్థ మన దగ్గర ఉంది. చాలా చోట్ల మురుగు నీళ్లు, వరద వెళ్లేందుకు ప్రత్యేక వ్యవస్థలు లేవు. రెండూ ఒకే ప్రవాహంలో వెళ్లడమే. అసలు హైదరాబాద్ పరిస్థితి వానాకాలంలోనే తెలుస్తుంది. సిటీలో 10 సెంటీమీటర్లకు పైగా ఏకధాటిగా వర్షం కురిస్తే అంతేసంగతి మరి. ఇది ఈ ఒక్కరోజులో జరిగింది కాదు. జనాభా విపరీతంగా పెరుగుతున్నా అందుకు తగ్గట్లు చర్యలు తీసుకోలేదు. ఎక్కడికక్కడ భవన నిర్మాణాలు పెరగడంతో ఫీడర్ చానళ్లు మూసుకుపోయాయి. చెరువులు, కుంటలు, ఫీడర్ చానెల్స్ ధ్వంసం కావడంతో నీళ్లన్నీ రోడ్లపైనే పారుతున్నాయి. హైటెక్ హంగులతో డెవలప్ అయిన మాదాపూర్, గచ్చిబౌలి ఏరియాల్లోనూ గంటకు రెండు సెంటీమీటర్ల వర్షపాతాన్ని మాత్రమే తట్టుకునే డ్రెయిన్స్ ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అందుకే ఎక్కడ రోడ్లపై వర్షం నీళ్లు నిలిచినా.. గంటల కొద్ది ట్రాఫిక్ జామ్ లు హైదరాబాద్ లో కామన్ అయ్యాయి. గంటలు గడిస్తే గానీ డెస్టినేషన్ చేరుకోలేని దుస్థితి.హైదరాబాద్ లో వస్తున్నదంతా నదీప్రాంత వరదే కాదు. అంతాకూడా అర్బనైజేషన్ ఎఫెక్టే అంటున్నారు. నగరీకరణ వరదలకు మరో ప్రధానకారణమంటున్నారు. హైదరాబాద్ అంటే లేక్ సిటీ అని పేరుండేది. ఒకప్పుడు సిటీకి నీటిని అందిస్తూ భూగర్భ జలాన్ని కూడా పెంచిన ఎన్నో చెరువులు ఇవాళ నీటితో కాక ఇళ్లతో నిండి ఉండడం చూస్తూనే ఉన్నాం. హైడ్రా అనే వ్యవస్థ వచ్చి అక్రమ నిర్మాణాలను కూల్చుతున్నదీ చూస్తున్నాం. అయితే ఇదే హైడ్రా స్పీడ్ నాలాల దాకా వస్తుందా అన్నది కీలకంగా మారింది. రాజధానిలో భూముల విలువ విపరీతంగా పెరగడంతో నాలాలు, చెరువులే రాజ మార్గంగా కబ్జా దార్లకు కనిపిస్తున్నాయి. దీంతో చెరువుల్లోకి వెళ్లాల్సిన వర్షపు నీరు రోడ్లపైకి, ఇండ్లల్లోకి చేరి నగరాన్ని ముంపు ముంగిట్లోకి తెచ్చాయి.3700 కోట్ల రూపాయలతో పూర్తిస్థాయి భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మిస్తామని గత ప్రభుత్వం ప్రకటించినప్పటికీ మురుగునీటిపారుదల వ్యవస్థ ఆధునీకరణ చేయడంలో మాత్రం విఫలమైంది. స్ట్రాటజిక్ నాలా డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ కూడా ఆశించినంత ఫలితం ఇవ్వలేదు. గ్రేటర్ హైదరాబాద్ విస్తీర్ణం 625 చదరపు కిలోమీటర్లు. జనాభా కోటి దాటింది. నగరంలో రోజూ 1400 మిలియన్ లీటర్ల మురుగు నీరు ఉత్పత్తి అవుతోంది. ఇందులో 700 మిలియన్ లీటర్ల మురుగు నీటిని జలమండలి ఎస్టీపీల్లో శుద్ధి చేస్తోంది. మిగతా మురుగు నీరు ఎలాంటి శుద్ధి ప్రక్రియ లేకుండానే సమీప చెరువులు, మూసీలో కలుస్తోంది. గ్రేటర్ పరిధిలో 1500 కిలోమీటర్ల మేర విస్తరించిన నాలాలపై వేలాదిగా అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. ఈ నాలాలను సమూలంగా ప్రక్షాళన చేయాలంటున్నారు. విస్తరించాలి కూడా.నాలాల ఆధునీకరణ ఆవశ్యకతను ప్రజలకు అర్థమయ్యేలా వివరించడం, ఇందుకోసం రాజకీయ పార్టీలు, ఎన్జీఓల సహకారం తీసుకోవడం కూడా ముఖ్యంగానే మారింది. కానీ నాలాలపై అక్రమ నిర్మాణాలను కూల్చుదామంటే మొదట అడ్డొచ్చేది పొలిటిషీయన్లే అంటున్నారు. ఎందుకంటే అక్కడ ఉండేది వారి ఓటర్లు.. లేదంటే వారి అనుచరగణం ఉండడమే కారణం. ఎక్కడ వ్యతిరేకత వస్తుందోనన్న ఉద్దేశంతో కూల్చివేతలకు ఇన్నాళ్లూ వెనుకడుగు వేశారు. కానీ ఇకపై సిటీలో సీన్ ఎలా ఉంటుందన్నదే చూడాలి,ప్రజలకు మేలు జరిగే పని కావాలంటే పాలకుడు పకడ్బందీగా ఉండాలి. కఠిన నిర్ణయాలైనా తీసుకునేందుకు సిద్ధంగా ఉండాలి. అందరినీ ఒప్పించాలి. మెప్పించాలి. అప్పుడే సమస్యల నుంచి శాశ్వత విముక్తి దొరుకుతుంది. హైదరాబాద్ లో చెరువుల ఆక్రమణలపై ప్రస్తుతం హైడ్రా దూకుడు పెంచింది. అలాగే నాలాల పరిస్థితి ఏంటన్న ప్రశ్నలు వస్తున్నాయి. వరద నీటిని మురుగునీటిని తరలించే నాలాలు అంతకంతకూ కుంచించుకుపోయాయి. వాటిపై అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీంతో కాస్త గట్టిగా వర్షం పడితే నాలాలు పొంగి, రోడ్లు, లోతట్టు కాలనీలను ముంచెత్తుతున్నాయి.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు

## గుజరాత్ దుష్టచతుష్టయం దేశాన్ని పట్టి పీడిస్తోంది

- మొదటి పేజీ తరువాయి

సీఎం మాట్లాడుతూ... అదానీ వ్యవహారాన్ని చట్టసభల్లో రాహుల్ గాంధీ బయటపె ట్టారన్నారు. భారత్‌కు రూ.183 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని, ఇందులో 16 మంది ప్రధానులు చేసిన అప్పుల కంటే ప్రస్తుత ప్రధాని మోదీ రెండింతలు అప్పుచేశారని విమర్శించారు. తన పరివారాన్ని కాపాడుకోవడానికే ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

దేశాన్ని మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీ చెరబట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ మెగా కుంభకోణంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సెబీ చైర్ పర్సన్ అక్రమాల పైనా జేపీసీ వేయాలన్నారు. ఇప్పుడు తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఉందన్నారు. కాగా, ఈ ఆందోళనలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి సత్యం విజయం సాధిస్తుందని ప్లకార్డును ప్రదర్శించారు.

మోదీ, అమిత్ షా, అదానీ, అంబానీ ఈ నలుగురి దుష్ట చతుష్టయం .. దేశాన్ని పట్టి పీడిస్తోందన్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. మోదీ ప్రజల సొమ్మును షేర్ మార్కెట్ల ద్వారా అదానీకి దోచిపెడుతున్నారని అనినారు. హిండెన్ బర్గ్ నివేదికపై విచారణ జరిపించాలన్నారు. సెబీ చైర్మన్ పై ఆరోపణలపై చట్ట సభల్లో కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. అదానీని కాపాడేందుకే మోదీ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అదానీపై జేపీసీతో విచారణ జరిపించాలని రాహుల్ పార్లమెంట్ లో డిమాండ్ చేస్తే మోదీ తప్పించుకున్నారని అన్నారు. సమాధానం చెప్పలేక నాలుగు రోజుల ముందే పార్లమెంట్ ను వాయిదా వేశారన్నారు.

దేశాని నలుగురు గుజరాతీలు దోచుకుంటున్నారు..మోదీ,అమిత్ షా అంబానీ,అదానీలకు దోచి పెడుతున్నారు.. బీజేపీ దోపిడిపై బీఆర్ఎస్ ఎందకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. దేశానికి బీజేపీ ముప్పులా మారింది..

ప్రతి చిల్లర విషయంలో స్పందించే కేటీఆర్ దీనిపై ఎందుకు స్పందించరు..అదానీ అవినీతిపై కేసీఆర్,కేటీఆర్ ఎందుకు స్పందించరు అని అన్నారు. ఇందిరా గాంధీ బ్యాంకులను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చారని గుర్తు చేశారు సీఎం రేవంత్ రెడ్డి.

**అదానీ ఆస్తులపై ఈడీకి ఫిర్యాదు**

సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ధర్నా అనంతరం అదానీ ఆస్తుల వ్యవహారంపై ఈడీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అదానీ కుంభకోణంపై విచారణ జరపాలని వినతిపత్రం ఇచ్చారు.

## సంజయ్ రాయ్ మనిషి కాదు... మృగం!...

- మొదటి పేజీ తరువాయి

సంజయ్ రాయ్ ను ప్రశ్నించిన ఆ టీమ్ దిగ్భ్రాంతికి గురైంది. అన్ని కోణాల్లో ప్రశ్నించిన తర్వాత అతడొక 'కామ పిశాచి' అని, జంతు ప్రవృత్తితో విచ్చలవిడిగా తయారయ్యాడని తేల్చారు. కామోన్మాదం బాగా తలకెక్కిన స్థితిలో దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డాడని గుర్తించారు. సెమినార్ హాల్లోకి ప్రవేశించడం దగ్గర్నుంచి, జూనియర్ డాక్టర్ పై అత్యాచారం చేయడం, ఆ తర్వాత ఆమెను చంపేయడం వరకు పూసగుచ్చినట్టు సంజయ్ రాయ్ చెబుతుండడం చూసి ఆ మానసిక నిపుణులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ముఖ్యంగా, అత్యాచారం ఎలా చేసిందీ చెబుతున్నప్పుడు అతడి ముఖంలో ఎలాంటి భావోద్వేగాలు లేకపోగా, అదేదో సాధారణమైన చర్య అయినట్టు అతడు జరిగింది జరిగినట్టు చెప్పడం సీబీఐ బృందాన్ని నివ్వెరపరిచింది.

సీబీఐ సేకరించిన వివరాల ప్రకారం... ఇతర జూనియర్ డాక్టర్లతో కలిసి రాత్రి భోజనం చేసిన ట్రైనీ డాక్టర్ రాత్రి ఒంటి గంట సమయంలో సెమినార్ హాల్ కు తిరిగొచ్చింది. రాత్రి 2.30 గంటల సమయంలో మరో జూనియర్ డాక్టర్ సెమినార్ హాల్ కు రాగా, అతడితో ఒకట్రెండు మాటలు మాట్లాడి తిరిగి నిద్రపోయింది.

కాగా, సంజయ్ రాయ్ వేకువ జామున 4 గంటల సమయంలో ఆసుపత్రి ప్రాంగణంలోకి ప్రవేశించాడు. అనంతరం, మూడో ఫ్లోర్ లో ఉన్న సెమినార్ హాల్లోకి వెళ్లి, నిద్రిస్తున్న జూనియర్ డాక్టర్ పై హత్యాచారానికి పాల్పడ్డాడు.

## కోల్‌కతా డాక్టర్ హత్యాచారం కేసును రాజకీయం చేయకండి

- మొదటి పేజీ తరువాయి

బెంగాల్ ప్రభుత్వానికి సూచించారు. ఈ మేరకు ఇరు ప్రభుత్వాల న్యాయవాదులను కోరారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.సుప్రీంకోర్టులో ఇవాళ విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, బెంగాల్ ప్రభుత్వ న్యాయవాది కపిల్ సిబల్ మధ్య వాగ్వాదం జరిగింది. రెచ్చగొట్టే ప్రకటనలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కపిల్ సిబల్ కోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాఖ్యలపై తుషార్ మెహతా స్పందిస్తూ... ఎవరూ అలాంటి ప్రకటనలు చేయవద్దని, పశ్చిమ బెంగాల్‌కు చెందిన మంత్రి చేసిన ప్రకటన తమ వద్ద ఉందని, ఇది చాలా తీవ్రమైన అంశమని అన్నారు. "మా నేతకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే వేళ్లు నరికివేయాలి" అని సదరు మంత్రి అన్నారని పేర్కొన్నారు.

కపిల్ సిబల్ స్పందిస్తూ... ప్రతిపక్ష నాయకుడు ఏం చెప్పారో కూడా నేను చెబుతానని, బుల్లెట్లు పేలుస్తానని వ్యాఖ్యానించారని సువెందు (అధికారి) అన్నారని పేర్కొన్నారు.

వారి వాగ్వాదం నేపథ్యంలో

ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ జోక్యం చేసుకున్నారు. దయచేసి దీనిని ఎవరూ రాజకీయం చేయవద్దు... చట్టం తన పని తాను చేసుకుపోతుందని వ్యాఖ్యానించారు. త్వరితగతిన, సమర్థవంతమైన విచారణతో చట్టం తన పని తాను చేసుకుపోతుందని వ్యాఖ్యానించారు.

## సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్.. డిప్యూటీ సీఎం భట్టి కూడా..

- మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేయనున్న రాజీవ్ గాంధీ విగ్రహం అంశాన్ని ఏఐసీసీకి సీఎం వివరించనున్నారు. వరంగల్ లో నిర్వహించ తలపెట్టిన కృతజ్ఞత సభకు రావాలని రాహుల్ గాంధీని ఆహ్వానిస్తారని సమాచారం. వీటితో పాటు రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితిని ఏఐసీసీ పెద్దలకు వివరిస్తారని సమాచారం.

## లోన్‌యాప్‌లపై ఈడీ ఉక్కుపాదం..

- మొదటి పేజీ తరువాయి

మహానంద ఇన్వెస్ట్ మెంట్స్, బస్కిన్ మేనేజ్ మెంట్ సహా ఇతర సంస్థలకు చెందిన 19కోట్ల39లక్షల రూపాయల ఫిక్స్ డ్ డిపాజిట్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు అటాచ్ చేశారు.

## తెలంగాణలో బీఆర్ఎస్ ఎక్కడుంది?

- మొదటి పేజీ తరువాయి

దాస్ మున్షి, మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అదానీ మెగా కుంభకోణంపై విచారణ జరపాలని ఈ సందర్భంగా కోమటిరెడ్డి డిమాండ్ చేశారు. సెబీ ఛైర్ పర్సన్ అక్రమాలపై జేపీసీ వేయాలని, ఆమె రాజీనామా చేయాలని అన్నారు. విదేశాల నుంచి నల్లధనం తెస్తామని, పేదల ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామన్న మోదీ... చివరకు 15 పైసలు కూడా వేయలేదని దుయ్యబట్టారు. పేదలను పట్టించుకోని మోదీ... అదానీని మాత్రం ప్రపంచంలోని ధనవంతుల జాబితాలో చేర్చారని కోమటిరెడ్డి మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని కాకపోతే... ఈ దేశాన్ని నలుగురి చేతుల్లో పెట్టి మోదీ నాశనం చేస్తారని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటయ్యాయని... లేకపోతే కాంగ్రెస్ 14 ఎంపీ సీట్లను గెలుచుకునేదని అన్నారు. అదానీ ఆస్తులు విపరీతంగా పెరగడంపై న్యాయ విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత... ఎయిమ్స్‌కు తరలింపు

- మొదటి పేజీ తరువాయి

దేశ రాజధానిలోని ఎయిమ్స్‌కు తరలించారు. ఆసుపత్రిలో ఆమెకు పరీక్షలు నిర్వహించారు. కవిత వైరల్ ఫీవర్, గైనిక్ సమస్యలతో బాధపడుతున్నట్లు డాక్టర్లు తెలిపారు. అంతకుముందు, జులై 16న కవిత జైల్లోనే అస్వస్థతకు గురయ్యారు. అప్పుడు ఆమెకు జ్వరం రావడంతో పశ్చిమ ఢిల్లీలోని హరి నగర్‌లో గల దీనదయాళ్ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం ఆమెను తిరిగి జైలుకు తీసుకువెళ్లారు. ఇప్పుడు ఆమెకు ఎయిమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు. కవిత గత ఐదు నెలలకు పైగా తీహార్ జైల్లో ఉంటున్నారు. ఇటీవల ఆమె దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. ఆలోగా ఈ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఈడీకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అదే సమయంలో 23వ తేదీలోగా రిజాయిండర్ దాఖలు చేయాలని కవిత తరపు న్యాయవాదులను ఆదేశించింది.

## యాదగిరిగుట్ట కేంద్రంగా హీటెక్కిన పాలిటిక్స్..

## హరీష్ రావు పూజలపై ఈవో అభ్యంతరం

- మొదటి పేజీ తరువాయి

యాక్ట్ 1988 ప్రకారం చర్యలు తీసుకోవాలంటూ స్టేషన్ హౌస్ ఆఫీసర్?కు ఫిర్యాదు చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వీళ్ళ చర్యలు ఉన్నాయంటూ ఈవో భాస్కర్ రావు ఫిర్యాదులో పేర్కొన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహా స్వామిని దర్శించుకుని మాజీ మంత్రి హరీష్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆగస్ట్ 15లోగా అన్న మాట ప్రకారం రుణమాఫీ చేశామని కాంగ్రెస్, పూర్తిగా చేయలేదని బీఆర్ఎస్ నాయకుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణం చేసి మాట తప్పారని గుట్ట సాక్షిగా హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. భక్తులకు హాని కలగొద్దని పూజలు చేసినట్లు చెప్పారు. ఆలయాలకు వెళ్లి ముఖ్యమంత్రి చేసిన పాపం తెలంగాణ ప్రజలకు శాపం కాకుండా చూసి రక్షించాలని దేవుళ్లకు పూజలు చేస్తానని హరీష్ రావు ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా.. ఇవాళ యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఈ పూజలపై ఆలయ ఈవో అభ్యంతరం వ్యక్తం చేయడంతో యాదగిరిగుట్ట సాక్షిగా తెలంగాణ రాజకీయాలు హాట్?హాట్?గా మారాయి.

## రేవంత్ రెడ్డికి సవాల్ విసిరితే సమాధానం రాలేదు

- మొదటి పేజీ తరువాయి

ప్రజలకు ఇచ్చిన ఇతర హామీలపై కాంగ్రెస్ నేతలకు మాట్లాడే సత్తా లేదని విమర్శించారు. శాసనసభలో సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నిస్తే మహిళ అని చూడకుండా ఆమెను అవమానించారని మండిపడ్డారు.

రుణమాఫీకి బీఆర్ఎస్ హయాంలో రాని సాంకేతిక సమస్యలు ఇప్పుడు ఎందుకు వస్తున్నాయో చెప్పాలన్నారు. రైతు రుణమాఫీ విషయంలో మిన్నకుంటే రైతు భరోసా విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వెంటపడి మరీ రైతులు రుణమాఫీపై నిలదీయాలని సూచించారు. ఈ ఆందోళన తొలి అడుగేనని... షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేసేదాకా వదిలి పెట్టేది లేదన్నారు.

## రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి: మందకృష్ణ మాదిగ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో అమలు చేయాలని ఎమ్మార్పీఎస్? వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ కోరారు.ఈ మేరకు సీఎం రేవంత్?రెడ్డిని జూబ్లీహిల్స్?లోని ఆయన నివాసంలో కలిసి, వినతి పత్రాన్ని అందజేశారు. కోర్టు ఇచ్చిన తీర్పుతో 30 ఏళ్ల నుంచి పోరాటం సాకారం అయిందన్నారు. రాష్ట్రంలో విద్యా, ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని సీఎంను కోరారు. మందకృష్ణతో పాటు ముఖ్యమంత్రిని కలిసిన మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య, లక్ష్మీకాంతారావు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు,మాజీ ఎంపీ పసునూరి దయాకర్, తదితరులు ఉన్నారు.

## లంచంతో దొరికిన కరెంట్ ఆఫీస్ టెక్నికల్ డివిజన్ ఇంజినీర్



**హైదరాబాద్ పెన్ పవర్:** సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ పరిధిలోని ఆపరేషన్స్ విభాగం కింద ఉన్న సూపరింటెండెంట్ ఇంజినీర్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడి చేశారు. ఈ క్రమంలోనే.. టెక్నికల్ డివిజన్ ఇంజినీర్ రామ్మోహన్ నాయుడు లంచం తీసుకుంటూ దొరికారు. ఓ కాంట్రాక్టర్ కు సంబంధించిన 2 ఫైల్స్ మూవ్ చేయటానికి 18 వేల లంచం డిమాండ్ చేశాడు రామ్మోహన్ నాయుడు. అతను ఏసీబీని ఆశ్రయించగా.. వల వేసి డబ్బులు తీసుకుంటుండగా పట్టుబడ్డాడు. ఆఫీసులోనే 18 వేల లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు వల పన్ని.. రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

# నామినేటెడ్ పదవులకు మళ్లీ బ్రేక్..

**విజయవాడ, ఆగస్టు 22:** ఏపీలో నామినేటెడ్ పదవుల భర్తీ మరోసారి వాయిదా పడింది. పదవుల భర్తీ కోసం ఆశగా ఎదురు చూస్తున్న కూటమి నేతలకు తాజా పరిణామాలు మింగుడు పడటం లేదు. ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి నామినేటెడ్ పదవుల కోసం నేతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. వీరిలో మాజీ మంత్రులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మొదలుకుని నియోజక వర్గ స్థాయి నేతలు మండల స్థాయి నేతలు కూడా ఉన్నారు. నామినేటెడ్ పదవుల కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో వాటిని వడపోసి ఎంపిక చేసే ప్రక్రియ ఇప్పటికి కొలిక్కి రాలేదు.నామినేటెడ్ పదవుల భర్తీని మొదట అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఆగస్ట్ 15లోగా పూర్తిగా చేయాలని భావించారు. ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజుల తర్వాత జులైలోనే ముఖ్యమైన పదవుల్ని భర్తీ చేస్తారని భావించినా అందులో జాప్యం జరుగుతూ వచ్చింది. మరోవైపు టీడీపీ-జనసేన-బీజేపీల మధ్య పదవులు పంపకంపై ఇంకా స్పష్టత రాలేదని తెలుస్తోంది.నామినేటెడ్ పదవుల భర్తీలో టీడీపీకి మొదటి ప్రాధాన్యం, జనసేన, బీజేపీలకు తర్వాత ప్రాధాన్యత ఇవ్వాలని టీడీపీ పెద్దలు భావించారు. కూటమి ఏర్పాటుతో పలువురు టీడీపీ సీనియర్లు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కోల్పోయారు. జనసేన 21 స్థానాల్లో పోటీ చేసి గెలిచింది. బీజేపీకి కేటాయించిన సీట్లలో కూడా మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. ఎన్నికల్లో ఫలితాలు రికార్డు స్థాయిలో రావడం కూడా ఒత్తిడి పెరగడానికి కారణం అయ్యింది. మూడు పార్టీలకు పోటీ చేసిన వాటిలో మెజార్టీ స్థానాల్లో గెలుపొందడంతో నామినేటెడ్ పదవులపై అంచనాలు కూడా పెరిగాయి.మరోవైపు నామినేటెడ్ పదవుల పంపకం నేడో రేపో జరుగుతుందని పుకార్లు షికార్లు చేస్తున్నా ఆ దిశగా ప్రయత్నాలు మాత్రం జరగడం లేదు. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో టీడీపీ-జనసేనలు సానుకూలంగానే ఉన్నా బీజేపీ మాత్రం తమకు ఎక్కువ ప్రాధాన్యత కావాలని పట్టుబడుతోంది. సీట్ల సర్దుబాటు సమయంలో ఇచ్చిన వాటితో సరిపెట్టుకున్నా నామినేటెడ్ పదవుల విషయంలో మాత్రం వెనక్కి తగ్గకూడదని ఆ పార్టీ యోచిస్తోంది. క్షేత్ర స్థాయిలో క్యాడర్‌ను బలోపేతం చేయడానికి పార్టీ నేతలకు పదవులు కీలకమని ఆ పార్టీ యోచిస్తోంది.మొత్తం అందుబాటులో ఉన్న పదవుల్లో తొలుత 30 నుంచి 50శాతం పదవుల్ని భర్తీ చేయాలని ఆ తర్వాత మిగిలిన భర్తీ చేయాలని భావించారు. మొదట భర్తీ చేసే వాటిలో 50శాతం పదవుల్ని టీడీపీకి 30శాతం జనసేనకు మిగిలినవి బీజేపీకి ఇవ్వాలని ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. అయితే ఈ ప్రతిపాదనకు బీజేపీ సుముఖంగా లేనట్టు తెలుస్తోంది. మరిన్ని పదవుల కోసం ఆ పార్టీ పట్టుబట్టడంతోనే నామినేటెడ్ పదవుల భర్తీ వాయిదా పడినట్టు తెలుస్తోంది.మరోవైపు నామినేటెడ్ పదవుల కోసం టీడీపీ కార్యాలయానికి భారీగా దరఖాస్తులు చేరుకున్నాయి. మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పదవుల కోసం నేతలు విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఐదేళ్లు పార్టీలో తాము చాలా కష్టపడ్డామని.. ఆర్థికంగా నష్టపోయామని, తమపై కేసులు కూడా ఉన్నాయని దరఖాస్తుల్లో చెబుతున్నారు.తమ వివరాలతో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులు,




సీనియర్ నేతల సిఫార్సుల లేఖలను కూడా వీటికి జత చేస్తున్నారు. నామినేటెడ్ పదవులు కేటాయించాలని ఇప్పటి వరకు సుమారు 23 వేల దరఖాస్తులు పార్టీ కార్యాలయానికి వచ్చాయి. భారీగా దరఖాస్తులు రావడంతో వీటిని వడపోసే కార్యక్రమాన్ని పార్టీ చేపట్టింది. అందరికీ ఎలా సర్దుబాటు చేయాలనే అంశంపై తీవ్ర కసరత్తు చేస్తోంది.రాష్ట్ర స్థాయిలో సుమారు 103 కార్పొరేషన్లు ఉన్నాయి. ఒక్కొక్క దానిలో ఛైర్మన్‌తోపాటు 11 మందికి డైరెక్టర్లుగా నామినేట్ చేసుకునే అవకాశం ఉంది. తద్వారా 1,130 మంది వరకు నామినేట్ చేసుకునే అవకాశం ఉంది. ఇవి కాకుండా మరో 300 పదవులు ఉండే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.జిల్లాల్లో గ్రంథాలయ సంస్థలు, మండల స్థాయిలో మార్కెట్ యార్డు కమిటీ పదవులు కూడా ఉన్నాయి. మొత్తం సుమారు 2,500 మందికి నామినేటెడ్ పదవులు దక్కే అవకాశం ఉంటుందని నేతలు చెబుతున్నారు.తాజాగా మూడు పార్టీల మధ్య పదవుల పంపకంపై ఏకాభిప్రాయం రాకపోవడంతో నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న వారికి ఉస్సురుమంటున్నారు.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు

## ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు

-నేడు ఆయన జయంతి



టంగుటూరి ప్రకాశం పంతులు 1872 ఆగస్టు 23న ఇప్పటి ప్రకాశం జిల్లా వినోదరాయునిపాలెము గ్రామంలో నియోగి బ్రాహ్మణులైన సుబ్బమ్మ, గోపాల కృష్ణయ్య దంపతులకు జన్మించాడు. సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి. నిరుపేద కుటుంబంలో పుట్టి, వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన ధీరోదాత్తుడు టంగుటూరి ప్రకాశం పంతులు. 1940, 50లలోని ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం ఒకడు. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించాడు. మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకి కెదురుగా గుండెనుంచి ఆంధ్రకేసరి అని పేరు పొందినవాడు. 1921లో ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1921 అక్టోబర్ 29 న స్వరాజ్య అనే దినపత్రికను ప్రారంభించాడు. కొద్ది కాలంలోనే, ఈ పత్రిక మంచి ఆదరణ చూరగొన్నది. దీని తెలుగు, తమిళ సంచికలకు ప్రజలు ఎగబడ్డారు. 1928లో మద్రాసులో సైమన్ కమిషను బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని, తుపాకికి ఎదురు నిలిచి, కాల్చుమని సవాలు చేసాడు. ఆయన ధైర్యసాహసాలకు మెచ్చి ఆంధ్ర ప్రజలు ఆయనకు ఆంధ్ర కేసరి అనే బిరుదునిచ్చి గౌరవించారు.1937లో కాంగ్రెసు అధికారంలోకి వచ్చినపుడు, రాజాజీ మంత్రివర్గంలో ఆయన రెవిన్యూమంత్రి అయ్యాడు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడు. 1946లో మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నికై, 13 నెలలపాటు ఆ పదవిలో కొనసాగాడు. ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాడు. స్వంతపార్టీలోని అంతర్గత రాజకీయాలకు ఆయన ప్రభుత్వం బలయ్యాక, పార్టీ నుండి బయటకు వచ్చి, స్వంతంగా ప్రజాపార్టీని స్థాపించాడు. రాజకీయాలనుండి వైదొలిగినా, ప్రకాశం చురుకుగా రాష్ట్రమంతటా పర్యటించాడు. అలాంటి ఒక ఒంగోలు పర్యటనలో వడదెబ్బకు గురై, నీరసించి హైదరాబాదులో ఆసుపత్రిలో చేర్పించబడ్డాడు. అక్కడే ప్రకాశం 1957, మే 20న పరమపదించాడు.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు

# ప్రభుత్వాలు మారినా మారని బ్రాండ్లు

**స్టేట్ బ్యూరో పెన్‌పవర్ విజయవాడ, ఆగస్టు 22:** ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి చంద్రబాబు వచ్చినా మద్యం దుకాణాల్లో విక్రయించే బ్రాండ్లలో మాత్రం మార్పు రాలేదు. బాబు వస్తే అన్ని మారిపోతాయి. నాణ్యమైన మద్యం అందుబాటులోకి వస్తుంది, ధరలు దిగొస్తాయని ఆశించిన మద్యం ప్రియులకు భంగపాటు తప్పలేదు. ప్రభుత్వాలు మారి మూడు నెలలు గడుస్తున్నా టీడీపీ మిత్ర పక్షాలు విమర్శలు గుప్పించిన జే బ్రాండ్లే ఇంకా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్నారు.మద్యం దుకాణాల్లో విక్రయించే బ్రాండ్లను రోజువారీ అమ్మకాల ప్రాతిపదికన ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్ డిస్టిలరీల నుంచి కొనుగోలు చేస్తుంది. ప్రభుత్వం మారిన తర్వాత కూడా పాత బ్రాండ్లనే విక్రయించడంలో మతలబు ఏమిటో ఎవరికి అంతు చిక్కడం లేదు. మరోవైపు ఏపీ బేవరేజీస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి అచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.మద్యం కొనుగోళ్లు, అమ్మకాలలో వినియోగదారుడికి, తయారీదారులకు మధ్య ప్రభుత్వమే మధ్యవర్తిగా ఉన్నపుడు ఇంకా నాసిరకం మద్యం, ఊరు పేరు లేని బ్రాండ్లనే మూడ్నెల్లుగా ఎందుకు విక్రయిస్తున్నారనే దానిపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ధరలను తగ్గించే అంశం కొత్త మద్యం పాలసీలో తీసుకోవాల్సి ఉన్నా, బ్రాండ్ల లభ్యత అంశం మాత్రం బేవరేజీస్ కార్పొరేషన్ చేతుల్లోనే ఉంటుంది. మద్యం దుకాణాల్లో విక్రయించాల్సిన బ్రాండ్లను నిర్ణయించే బేవరేజీస్ కార్పొరేషన్ కొన్ని బ్రాండ్లనే ఇప్పటికీ అందుబాటులో ఉంచుతోంది. ఎన్నికలకు ముందు వరకు ఏ బ్రాండ్లనైతే జే బ్రాండ్లుగా తిట్టిపోశారో అవే బ్రాండ్లను ఇప్పటికీ విక్రయిస్తున్నారు. ఇదంతా కొందరి కనుసన్నల్లో వ్యూహాత్మకంగా జరుగుతోందనే అనుమానాలు ఉన్నాయి.ఏపీలో కొత్త ఎక్సైజ్ పాలసీ అక్టోబర్ నుంచి అమల్లోకి రానుంది. మద్యం పాలసీలో ప్రైవేట్ మద్యం దుకాణాలను ప్రారంభించేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలను నిర్వహించింది. ఇది కొంత మేరకు సత్ఫలితాలను ఇచ్చింది. ఇప్పుడు ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పోయినా ఫర్లేదు మద్యం అమ్మకాలు ప్రైవేట్‌కు ఇచ్చేయాలని ఎన్డీఏ కూటమి భావిస్తోంది.ఇందులో భాగంగానే పాత బ్రాండ్లనే ఇంకా దుకాణాల్లో విక్రయిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. మద్యం విక్రయాల్లో వేల కోట్ల రుపాయల లాభాలు కళ్ల ముందుకు కనిపిస్తుండటంతో వాటిని దక్కించుకునేందుకు రాజకీయ పలుకుబడి ఉన్న లిక్కర్ సిండికేట్లు పావులు కదుపుతున్నాయి.ప్రైవేట్ మద్యం దుకాణాలను అనుమతిస్తే ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడే




ప్రమాదం ఉంది. అయితే ప్రభుత్వ పెద్దల నిర్ణయానికి ఎదురు చెప్పే సాహసం ఐఏఎస్ అధికారులు చేయకపోవచ్చు. ప్రైవేట్ దుకాణాలను అనుమతిస్తే డిస్టిలరీ నుంచి నేరుగా దుకాణాలకు నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం కూడా సరఫరా చేసే ప్రమాదం ఉంటుంది.బేవరేజీస్ కార్పొరేషన్ నుంచి సరఫరా చేసే మద్యం స్థానంలో నేరుగా డిస్టిలరీ నుంచి కొనుగోలు చేసే మద్యాన్ని విక్రయించి లిక్కర్ సిండికేట్లు లాభ పడిన ఉదంతాలు గతంలో కొకొల్లలుగా ఉన్నాయి. ఇక మద్యం దుకాణాలను నేరుగా డిస్టిలరీలే దక్కించుకునే అవకాశం కూడా ఉంటుంది. బినామీ పేర్లతో మద్యం వ్యాపారంలోకి నేరుగా డిస్టిలరీలు ప్రవేశించడం ద్వారా లాభాలను దక్కించుకోడానికి ప్రయత్నిస్తారనే అనుమానాలు ఉన్నాయి. ప్రైవేట్‌కు మద్యం వ్యాపారాన్ని అప్పగించడం ఎంత మేరకు ప్రభుత్వానికి లాభమనే ఆలోచన లేకుండా ఎక్సైజ్ మంత్రి నుంచి అధికారుల వరకు ప్రైవేట్ రాగం ఆలపించడం వెనుక ముందస్తు ప్రణాళిక ఉందనే అనుమానాలు ఉన్నాయి.ఏపీలో గత ఐదేళ్లుగా రకరకాల బ్రాండ్లను ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విక్రయించినా జనం మరో దారి లేక వాటినే కొనుగోలు చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు రెట్లు ధరలు పెంచిన ప్రభుత్వం మద్యం తయారీదారుల్ని తన దారిలోకి తెచ్చుకోడానికి రకరకాల అస్త్రాలు ప్రయోగించింది. ఈ క్రమంలో మద్యం మీద కళ్లు చెదిరే ఆదాయం కూడా ప్రభుత్వానికి వచ్చింది. మద్యం డిస్టిలరీలు, అమ్మకాలు, నగదు చెల్లింపులు మాత్రమే చేసినా ప్రభుత్వానికి ఏటా రూ.36వేల కోట్ల ఆదాయం వచ్చింది.2018-19 నాటికి ఈ ఆదాయం రూ.18వేల కోట్లు మాత్రమే ఉండేది. కేవలం ధరల ఆధారంగానే మద్యం అమ్మకాలు జరిగినా జనం జేబులు ఖాళీ చేసుకుంటూ నాసిరకం మద్యాన్ని విధిలేని పరిస్థితుల్లో కొనుగోలు చేసేవారు. 2019 నాటికి రూ.100లోపు ధర ఉన్న ఐఎంఎఫ్ఎల్ మద్యం ధర దాదాపు రెట్టింపు అయ్యింది. పాపులర్ బ్రాండ్లు మొత్తం కనుమరుగై పోయాయి.ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం మద్యం ధరల్ని గాడిన పెడుతుందని భావిస్తే మళ్లీ ప్రైవేట్ దుకాణాలను తెచ్చేందుకు ఉత్సాహం చూపడం పలు అనుమానాలకు తావిస్తోంది. మద్యం ధరల్ని గణనీయంగా తగ్గిస్తామనే ప్రకటన ప్రజలకు ఊరటనిచ్చినా ప్రైవేట్ దుకాణాలతో లాభం ఎవరికనే సందేహాలు లేకపోలేదు.మద్యం తయారీ మొదలు విక్రయాల వరకు ప్రతి పైసాకు నాలుగైదు రెట్లు లాభాలు ఉండటాయి. దీంతో కొత్త మద్యం పాలసీపై లిక్కర్ సిండికేట్లు కన్నేశాయి.

ఐదేళ్లుగా మద్యం విక్రయాల ద్వారా వచ్చిన ఆదాయం చాలా వరకు ప్రభుత్వ ఖజానాకు చేరింది. ప్రభుత్వం విక్రయించిన మద్యం నాణ్యత, ధరలపై ఎన్ని విమర్శలు ఉన్నా మద్యం ద్వారా లభించిన ఆదాయం మాత్రం గణనీయంగా పెరిగింది.ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొత్త లిక్కర్ పాలసీ ప్రవేశ పెడుతుందనే వార్తల నేపథ్యంలో లిక్కర్ సిండికేట్లు జోరుగా ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఇప్పటికే ప్రైవేట్ దుకాణాల ఏర్పాటుకు ప్రభుత్వ పెద్దల్ని ఒప్పించడంలో అవి సక్సెస్ అయ్యాయి. వీలైనన్ని మద్యం దుకాణాలను దక్కించుకోడానికి సిండికేట్లు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఐదేళ్లుగా ప్రభుత్వమే నేరుగా మద్యాన్ని విక్రయించడంతో ఆదాయాన్ని కోల్పోయిన వ్యాపారులు, రాజకీయ నాయకులు, డిస్టిలరీలు కుమ్మక్కై కొత్త పాలసీని ప్రభావితం చేసే ప్రయత్నాలు చేస్తున్నారు.ఏపీలో మద్యం విక్రయాలను మించిన ఆదాయ మార్గం ప్రభుత్వానికి మరొకటి లేదు. ఏటా రూ.36వేల కోట్ల రుపాయల ఆదాయం ఖజానాకు లభిస్తోంది. ఇందులో నాలుగో వంతు ఉత్పాదక వ్యయంగా పోయినా దాదాపు రూ.27వేల కోట్ల రుపాయలు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయంగా లభించేది. 2019కు ముందు మద్యం ద్వారా ప్రభుత్వానికి సమకూరిన ఆదాయంలో మద్యం దుకాణాలు కూడా భారీగానే లాభపడ్డాయి.

## అక్టోబరు 15న సిరిమానుఉత్సవం

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయనగరం, ఆగస్టు 22:** ఉత్తరాంధ్ర పెద్ద పండుగగా చెప్పుకునే విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను పండుగకు ముహూర్తం ఖరారు చేశారు ఆలయ అర్చకులు. పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతరంటే




ఉత్తరాంధ్రవాసులకు ఒక సంబరం. జీవితంలో ఒక్కసారయినా ఆ జాతరను చూసి తరించాలని అందరూ పరితపిస్తుంటారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న పైడితల్లి అమ్మవారి జాతర కోసం ఇప్పటికే అధికారులు పనులు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పండుగగా జరిపే ఈ పండుగకు విజయనగరంతో పాటు విశాఖపట్నం, శ్రీకాకుళం, తెలంగాణ, ఒడిస్సా, ఛత్తీస్?ఘడ్ రాష్ట్రాల నుండి కూడా లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని భక్తిపారవశ్యంలో మునిగిపోతారు. నలభై రోజుల పాటు సాగే ఈ పండుగకు రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తుందిపైడితల్లి పండగ వచ్చిందంటే అందరూ ఆనందోత్సవాల్లో మునిగిపోతారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న అమ్మవారి పండగకు ముహూర్తం ఖరారు చేశారు అధికారులు. సెప్టెంబర్ 20 భాద్రపద బహుళ తదియ రోజున మండల దీక్షతో ప్రారంభమవనున్న ఈ పండుగ అదే రోజు ఉదయం 11 గంటలకు అమ్మవారికి పండుగ రాట వేసి ఉత్సవాలు ప్రారంభిస్తారు. అక్టోబర్ 14 న అమ్మవారి తొల్లేళ్ల ఉత్సవం జరగనుండగా, ప్రధాన ఘట్టమైన సిరిమాను ఉత్సవం అక్టోబర్ 15న జరగనుంది. అక్టోబర్ 22వ తేదీ మంగళవారం పెద్దచెరువులో అమ్మవారి తెప్పోత్సవం, 27 సాయంత్రం కలశ జ్యోతుల ఊరేగింపు జరుపుతారు. అక్టోబర్ 29న మంగళవారం చదురుగుడి వద్ద ఉయ్యాల కంబాల మహోత్సవం, 30న బుధవారం వనం గుడి ఆవరణలో చండీహోమం, పూర్ణాహుతి, దీక్షా విరమణ ఉదయం ఎనిమిది గంటల నుండి సాగుతాయి.సిరిమానోత్సవంలో భాగంగా అమ్మవారికి సంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు అధికారులు. ఈ పండుగలో ప్రధాన ఘట్టమైన అమ్మవారి సిరిమానును ఆలయ ప్రధాన పూజారి బంటుపల్లి వెంకట్రావు ఎనిమిదవ సారి సిరిమానును అధిరోహించి భక్తులకు అమ్మవారి ప్రతిరూపంగా దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారి సిరిమాను జాతర ఆలయ సంస్కృతి, సంప్రదాయాలతో సాగనుంది. గజపతిరాజుల ఆడపడుచు అయిన పైడితల్లి అమ్మవారి పండుగకు గజపతిరాజుల వారసులు, ఆలయ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు పర్యవేక్షణలో సాగనుంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజులు పండుగకు కావలసిన అన్నిరకాల ఏర్పాట్లు కోసం ముమ్మర కసరత్తు చేస్తున్నారు.

# తాడిపత్రికి ప్రశాంతత ఎప్పుడు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ అనంతపురం, ఆగస్టు 22:** తాడిపత్రి అంటేనే కేరాఫ్ హైటెన్షన్. అక్కడ ఎప్పుడూ ఏదో ఒక హడావుడి ఉండనే ఉంటుంది. ఏ పార్టీ అధికారంలో ఉందన్నది లెక్కే కాదు. ఎవరు పవర్ లో ఉన్నా రచ్చ కామన్. ఒకరిపై ఒకరు రాళ్ల దాడులతో.. పోలీసులతో సహా ఇరువర్గాలు గాయపడటం రెగ్యులర్ అయిపోయింది. నిత్యం ఉద్రిక్తతలు కంటిన్యూ అవుతూనే ఉన్నాయి. కేతిరెడ్డి పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్ డ్డి ఏదో ఒక ఇష్యూతో రచ్చకెక్కుతూనే ఉన్నారు. రాజకీయ ఆధిపత్యం కోసం జరుగుతున్న ఘర్షణలతో.. తాడిపత్రి టాక్ ఆఫ్ ది న్యూస్‌గా ఉంటోంది.ఏపీ మొత్తం ఒక ఎత్తు అయితే.. తాడిపత్రి మాత్రం ఆధిపత్య పోరుతో ఉద్రిక్తతలకు కేరాఫ్‌గా ఉంటోంది. కేతిరెడ్డి పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డి కుటుంబాల మధ్య నాలుగు దశాబ్దాలుగా వైరం ఉంది. ఒకప్పుడు ఫ్యాక్షన్ గొడవలు జరిగితే.. ఇప్పుడు రాజకీయ ఆధిపత్యం కోసం చూసుకుందామంటే.. చూసుకుందామంటూ టెన్షన్ సిచ్యువేషన్‌కు కారణం అవుతున్నారు ఈ ఇద్దరు నేతలువైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జేసీ ప్రభాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య నిత్యం ఏదో ఒక వివాదం నడిచేది. అభివృద్ధి విషయంలో అయినా.. తాడిపత్రిలో ఏ కార్యక్రమం జరిగినా సరే ప్రతిరోజు రచ్చ ఉండేది. పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉంటుంది. ఇక చిన్నపాటి గొడవ జరిగినా ప్రత్యేక బలగాల మోహరింపు పరిపాటిగా మారింది. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా



పరిస్థితుల్లో ఏ మాత్రం మార్పు రాలేదు.ఎన్నికల మరుసటి రోజు జరిగిన గొడవల కారణంగా మాజీ ఎమ్మెల్యేలు జేసీ ప్రభాకర్ రెడ్డి ఆయన కొడుకు అస్మిత్‌రెడ్డితో పాటు కేతిరెడ్డి పెద్దారెడ్డిని కూడా తాడిపత్రిలోకి రాకూడదని కోర్టు ఆంక్షలు విధించింది. ఆ తర్వాత ఆంక్షలు సడలించారు. దీంతో జేసీ ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి తాడిపత్రిలో నిత్యం పర్యటిస్తున్నారు. కానీ పెద్దారెడ్డి తాడిపత్రిలోకి వచ్చేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా ఆయనను తాడిపత్రిలోకి రానివ్వలేదు. మంగళవారం రోజు తన స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించారు పెద్దారెడ్డి.పోలీసులు ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పెద్దారెడ్డి అతని నివాసానికి వెళ్తారేమోనని తాడిపత్రి భగత్ సింగ్ నగర్‌లో కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి దగ్గరకు టీడీపీ నేతలు భారీగా చేరుకున్నారు. పెద్దారెడ్డి ఊరిలో ఉండకూడదని టీడీపీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో రెండువర్గాల మధ్య రాళ్ల దాడులు జరిగాయి. దీంతో పరిస్థితులు మరోసారి చేయి దాటిపోయాయి. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితుల నడుమ కేతిరెడ్డి పెద్దారెడ్డిని అనంతపురం వైపు తరలించారు. మరోవైపు వైసీపీ నాయకుడు కందిగోపుల మురళి వాహనాలను ధ్వంసం చేశారు. ఇంటికి నిప్పుపెట్టారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై కూడా జేసీ ప్రభాకర్ రెడ్డి అనుచరులు దాడికి యత్నించారు.ఇంత జరిగినా పెద్దారెడ్డి మాత్రం వెనక్కి తగ్గడం లేదు. జేసీ ప్రభాకర్ రెడ్డి చెప్పడం వల్లే తనను తాడిపత్రిలోకి రానివ్వడం లేదని.. ఇదే పరిస్థితి అతనికి, అతని కొడుక్కి కూడా వస్తుందని పెద్దారెడ్డి హెచ్చరిస్తున్నారు. వాళ్లు ఎన్ని చేసినా తాను తాడిపత్రికి వస్తానని.. తనను ఆపలేరంటున్నారు. మరోవైపు ఈ ఘటన తర్వాత జిల్లా ఎస్పీ జగదీష్ తాడిపత్రిలోనే మకాం వేశారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం దాడికి గురైన కందిగోపుల మురళి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పెద్దారెడ్డి అనంతపురంలో ఉండిపోయారు. జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన తనయుడు ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి అసలు తాడిపత్రిలో లేరు. ఇవన్నీ చూస్తుంటే పైకి ప్రశాంతంగా కనిపిస్తున్నా.. ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇలా ప్రతిసారి ఏదో ఒక ఘర్షణతో తాడిపత్రి ప్రజలకు ప్రశాంతత అన్నదే లేకుండా పోయింది. పోలీసులకు ఇది పెద్ద తలనొప్పిగా మారింది.

## జగన్ కోసమే గెజిట్...

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ నెల్లూరు, ఆగస్టు 22:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీబీఐ విచారణకు నేరుగా ఏపీలో అనుమతిస్తూ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు గెజిట్ జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ఉద్యోగులు, ప్రయివేటు సంస్థలు వంటి




వాటిపై ఏదైనా ఫిర్యాదు వస్తే సీబీఐ నేరుగా విచారణ చేపట్టేందుకు అవకాశమిచ్చింది. అయితే ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో సీబీఐ విచారణ చేపట్టాలంటే మాత్రం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరి అంటూ షరతు మాత్రం విధించింది. 2014 - 2019 తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సీబీఐ విచారణకు నిరాకరిస్తూ నాటి చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది కొన్ని కీలక కేసులను అయితే తర్వాత జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సీబీఐ విచారణకు అనుమతించినప్పటికీ తాజాగా మరోసారి గెజిట్ విడుదల చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. జగన్ తో పాటు వైసీపీ నేతల కోసమే ఈ గెజిట్ ను విడుదల చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొన్ని కీలక కేసులను సీఐడీకి అప్పగించింది. మద్యం కేసుతో పాటు ఇసుక దోపిడీ, ఆడుదాం ఆంధ్ర, ఫైబర్ నెట్ కేసులను ఏపీ సీఐడీ విచారిస్తుంది. అయితే సీఐడీ విచారణ చేపట్టే ఈ కేసుల కన్నా ముఖ్యమైన కేసులను సీబీఐకి అప్పగించాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారని చెబుతున్నారు. ... సీబీఐ విచారణతో జగన్ రాజకీయంగా ఇబ్బందులను ఎదుర్కొనడమే కాకుండా న్యాయస్థానాలకు హాజరయ్యే అవకాశముందని అంచనా వేస్తున్నారు. జగన్ ప్రభుత్వం చేసిన తప్పు?లను లెక్క గడుతున్న కూటమి ప్రభుత్వం సీబీఐ అయితే జగన్ కు కరెక్ట్ అని భావించి తిరిగి సీబీఐ ఏపీలో విచారణకు అనుమతిస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అక్రమ బియ్యం సరఫరాపై ద్వారపురెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో పాటు వివిధ కేసుల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు మరికొందరు సీనియర్ నేతలను కూడా ఇరికించే ప్రయత్నం జరుగుతుందని వైసీపీ నేతలు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద చంద్రబాబు స్కెచ్ జగన్ పార్టీపై అదిరిపోయిందిగా?

# రిజ్వాన్‌కు తప్పని నిరాశ.. డబుల్ సెంచరీ కాకుండానే ఇన్నింగ్స్ డిక్లేర్



రావల్పిండి వేదికగా బంగ్లాదేశ్ పై జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్థాన్ వికెట్ కీపర్ బ్యాటర్ మహమ్మద్ రిజ్వాన్‌కు ఊహించని షాక్ తగిలింది. నాలుగు వికెట్లు పడిన అనంతరం క్రీజ్ లోకి వచ్చిన రిజ్వాన్.. తొలి రోజు అద్భుతంగా బ్యాటింగ్ చేసి అజేయంగా నిలిచాడు. రెండో రోజు అదే జోరును కొనసాగించి హాఫ్ సెంచరీ.. సెంచరీ.. 150 పరుగుల మార్క్ ను చేరుకున్నాడు. ఇతని ఫామ్ చూస్తుంటే ఈజీగా డబుల్ సెంచరీ మార్క్ అందుకునేలా కనిపించాడు. అయితే వ్యక్తిగత స్కోర్ 171 పరుగుల వద్ద ఉన్నప్పుడు పాక్ ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసింది.

అప్పటికే పాకిస్థాన్ 6 వికెట్లకు 448 పరుగుల భారీ స్కోర్ చేసింది. మరో సెషన్ మిగిలి ఉంది. ఈ దశలో కెరీర్ లో తొలి డబుల్ సెంచరీ అందుకోవాలని ఆశించిన రిజ్వాన్‌కు నిరాశ తప్పలేదు. మరో నాలుగు లేదా ఐదు ఓవర్లు పాకిస్థాన్ బ్యాటింగ్ చేసి ఉన్నా ఈ వికెట్ కీపర్ బ్యాటర్ డబుల్ సెంచరీ ఫిగర్ మార్క్ అందుకునేవాడు. అయితే వ్యక్తిగత రికార్డ్స్ కన్నా మ్యాచ్ గెలుపే లక్ష్యంగా భావించి తొలి ఇన్నింగ్స్ ను డిక్లేర్ చేసినట్టు తెలుస్తుంది. తొలి రోజు వర్షం పడడం.. ఆట మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో పాక్ డిక్లేర్ ఇవ్వక తప్పలేదు.

ఈ మ్యాచ్ లో రిజ్వాన్ 239 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 171 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇక ఈ మ్యాచ్ విషయానికి వస్తే పాకిస్థాన్ తమ తొలి ఇన్నింగ్స్ లో 6 వికెట్ల నష్టానికి 448 పరుగుల వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రిజ్వాన్ తో పాటు సౌద్ షకీల్ (141) భారీ శతకం బాదాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన బంగ్లాదేశ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 27 పరుగులు చేసింది.

# పాఠ్యాంశాల్లో ప్రాథమిక సబ్జెక్టుగా క్రికెట్.. ఏ దేశంలో అంటే..?





సాధారణంగా పుస్తకాల్లో గొప్ప క్రికెటర్ గురించి ఒక పాఠం ఉండడం.. క్రికెట్ గురించి ఒక చాప్టర్ ఉండడం సహజం. కానీ ఒక దేశంలో మాత్రం క్రికెట్ నే ఒక సబ్జెక్టుగా చేయబోతున్నారు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. ఆ దేశం మరేదో కాదు.. క్రికెట్ లో ఎన్నో ఏళ్లుగా తమ ఆధిపత్యాన్ని చూపించిన ఆస్ట్రేలియా. నివేదికల ప్రకారం ఆస్ట్రేలియాలోని ఒక స్కూల్స్ లో క్రికెట్ ను వారి ప్రాథమిక సబ్జెక్టుగా చేర్చే ప్రయత్నం చేస్తున్నారు. త్వరలో క్రికెట్ కూడా వారి పుస్తకాల్లో ఒక పాఠం కాకుండా ఒక సబ్జెక్టు కాబోతుంది. వస్తున్న సమాచార ప్రకారం.. విక్టోరియాలోని లారా సెకండరీ కాలేజ్ క్రికెట్‌ను కేవలం పాఠ్యేతర కార్యకలాపంగా కాకుండా అధికారిక సబ్జెక్ట్‌గా తొలిసారి పరిచయం చేసింది. విక్టోరియాలోని పాఠశాలల్లో విద్యార్థులకు క్రికెట్ గురించి బోధించడం అకాడమీ ఉద్యమం యొక్క లక్ష్యం. క్రికెట్ లో ఆస్ట్రేలియాకు ఘనమైన చరిత్ర ఉంది. క్రికెట్ ను కనిపెట్టింది ఇంగ్లాండ్ అయినా శాసించింది మాత్రం ఆస్ట్రేలియా అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కొన్ని దశాబ్దాలుగా క్రికెట్ లో అత్యుత్తమ ప్రదర్శన చేసి టాప్ లో నిలిచారు. క్రికెట్ పై తమదైన ముద్ర వేస్తూ ఏకంగా 6 వన్డే వరల్డ్ కప్ ట్రోఫీలు గెలుచుకున్నారు.

# టెస్ట్ ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్.. టాప్‌లోనే భారత ఆటగాళ్లు







ఐసీసీ తాజాగా ప్రకటించిన టెస్ట్ ర్యాంకింగ్స్ లో టీమిండియా ఆల్ రౌండర్లు రవి చంద్రన్ అశ్విన్. రవీంద్ర జడేజా తమ స్థానాలను నిలుపుకున్నారు. జడేజా 444 రేటింగ్ పాయింట్లతో టాప్ లో కొనసాగుతూ ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచాడు. 322 రేటింగ్ పాయింట్లతో అశ్విన్ రెండో స్థానంలోనే ఉన్నాడు. వెస్టిండీస్ ఆల్ రౌండర్ జేసన్ హోల్డర్ సౌతాఫ్రికాపై జరిగిన టెస్టులో అద్భుతంగా రాణించి.. రెండు స్థానాలను ఎగబాకి 5 వ స్థానానికి చేరుకున్నాడు. భారత మరో ఆల్ రౌండర్ అక్షర్ పటేల్ ఆరో స్థానంలో ఉన్నాడు.

బౌలింగ్ విషయానికి వస్తే టీమిండియా వెటరన్ స్పిన్నర్ అశ్విన్ (870) తన అగ్ర స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. బుమ్రా (847) మూడో స్థానంలో.. జడేజా(788) ఏడో స్థానంలో ఉన్నారు. టీమ్స్ లో ఆస్ట్రేలియా (124) అగ్ర స్థానంలో.. ఇండియా(120) రెండో స్థానంలో ఉన్నాయి. బ్యాటింగ్ లో ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ టెస్టుల్లో నెంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్‌ను అధిగమించి అగ్రస్థానంలో నిలిచాడు.

ప్రస్తుతం రూట్ ఖాతాలో 872 రేటింగ్ పాయింట్స్ ఉండగా విలియంసన్ కు 859 పాయింట్స్ ఉన్నాయి. ఇటీవలే వెస్టిండీస్ తో జరిగిన మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో రూట్ సత్తా చాటాడు. ప్రస్తుతం శ్రీలంక, ఇంగ్లాండ్ ల మధ్య మూడు టెస్ట్ మ్యాచ్ ల సిరీస్.. బంగ్లాదేశ్, పాకిస్థాన్ ల మధ్య రెండు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ జరుగుతున్నాయి. ఈ సిరీస్ ల ఫలితాలని బట్టి ర్యాంకింగ్స్ మారే అవకాశం ఉంది.



మాళవిక మోహనన్ యొక్క నక్షత్ర లుక్స్

# శ్రీనిధి శెట్టి .. టాలీవుడ్ ఎంట్రీ



కేజీఎఫ్ సినిమాతో క్రేజ్ అందుకున్న కన్నడ హీరోయిన్ శ్రీనిధి శెట్టి.. ఆ తర్వాత 'కోబ్రా' అనే సినిమాతో కోలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇచ్చింది. ఇప్పుడు 'తెలుసు కదా' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రాశీఖన్నా ఓ హీరోయిన్‌గా నటిస్తుండగా, మరో హీరోయిన్‌గా శ్రీనిధి నటిస్తోంది. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయమవుతోంది. ఇటీవల షూట్ మొదలైంది. ఫస్ట్ షెడ్యూల్‌లో సిద్దూ జొన్నలగడ్డ, రాశి ఖన్నాలపై టాకీతో పాటు ఓ పాటను చిత్రీకరించారు. తాజాగా కొత్త షెడ్యూల్ మొదలైంది. శ్రీనిధి శెట్టి ఈ షెడ్యూల్‌లో జాయిన్ అయింది. ఆమెపై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. రొమాంటిక్ స్టోరీలో బ్యూటిఫుల్ చాప్టర్ స్టార్ట్ చేయబోతున్న శ్రీనిధికి గ్రేట్ సక్సెస్ రావాలంటూ షూటింగ్ స్పాట్‌లో తీసిన ఫోటోను ఈ సందర్భంగా మేకర్స్ షేర్ చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నాడు. .



ఆకాంక్ష శర్మ యొక్క అద్భుతమైన భంగిమలు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com